# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్రకమిటీ

## పత్రికా ప్రకటన

**తేది: 5-5-2018**

### పోలీసు, అర్ధసైనిక, కమాండో బలగాలు కొనసాగిస్తున్న సామూహిక హత్యాకాండను ఖండించండి !
### తాడ్‌పాల్, కస్నూర్, ఆయిపేంట అమరుల ఆశయాలను తుదివరకు కొనసాగిద్దాం !
### భారత ప్రజాస్వామిక విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం, బలోపేతం చేద్దాం, పురోగమిద్దాం !

**ప్రియమైన ప్రజలారా !**

2018 మార్చి 10 నుండి ఏప్రిల్ 27 మధ్య పోలీసు, అర్ధసైనిక, కమాండో బలగాలు దండకారణ్యంలో కొనసాగించిన మూడు సామూహిక హత్యాకాండలలో 58 మంది విప్లవకారులు అసువులు బాసారు. బీజాపూర్ జిల్లా పూజారీ కాంకేర్ పరిసరాల లోని తాడ్‌పాల్ అడవులలో 10 మంది కామ్రేడ్స్‌ను (7 గురు మహిళలు, ముగ్గురు పురుషులు), అదే జిల్లా హల్చి తుమిరిగుండ అడవిలో ఇంద్రావతి నది ఒడ్డున గఢ్‌చిరోలి సి60 కమాండోలు 40 మంది విప్లవకారులను, గ్రామస్థులను (22 మంది మహిళలు, 18 మంది పురుషులు) కుప్పగా చేసి సామూహికంగా హత్య చేశారు. సి-60 కమాండోలు ఈ ఘాతుకానికి పాల్పడడంతో నదికి గఢ్‌చిరోలి వైపు గల కస్నూర్ హత్యాకాండగా ప్రచారం అయ్యింది. ఆ వెన్వెంటనే అదే బీజాపూర్ జిల్లా ఇలిమేడ్ వద్ద గల ఆయిపేంట గుట్టలలో 8 మంది (6 గురు మహిళలు, ఇద్దరు పురుషులు) విప్లవకారులను కాల్చి చంపారు. ఈ మూడు భారీ ఎన్‌కౌంటర్లలో 35 మంది మహిళలను, 23 మంది పురుషులను హత్య చేశారు. సి-60 కమాండోల కాల్పులలో గాయపడి తమ చేతికి చిక్కిన 11 మందిలో నుండి ఆరుగురిని వారి అధికారి ఏఎస్‌పి మహేశ్వర్ రెడ్డి ఖాంద్లారాజారాం అడవులలో కాల్చి చంపాడు. కస్నూర్ ఘటనలో 24 మంది కామ్రేడ్స్ నదిలో మునిగి ప్రాణాలు వదిలారు. వీరందరి స్మృతిలో మా కేంద్రకమిటీ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లర్పిస్తోంది. వీరే కాకుండా దేశంలోని మిగతా విప్లవోద్యమ ప్రాంతాలలో (బీహార్-ఝార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో) గత నాలుగు మాసాలలో జరిగిన రోజువారీ ఎదురుకాల్పులలో, బూటకపు ఎదురుకాల్పులలో పదుల సంఖ్యలో విప్లవకారులను, విప్లవ ప్రజలను, విప్లవ ప్రజానిర్మాణాల కార్యకర్తలను పోలీసులు హత్య చేశారు. విప్లవోద్యమ ఆశయ సాధనలో అసువులు బాసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి ఆశయాలను తుదివరకూ కొనసాగిస్తామనీ భా.క.పా. (మావోయిస్టు) మరోసారి ప్రతిన బూనుతోంది.

కేంద్రంలో బీ.జే.పీ. నాయకత్వంలో ఎన్.డీ.ఏ. అధికారంలోకి వచ్చిన గత నాలుగేళ్లలో అన్ని రాష్ట్రాలలోని మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలపై పోలీసు, అర్ధసైనిక, కమాండో బలగాలను పెద్ద సంఖ్యలో దింపి గత ఎనిమిదేళ్లుగా కొనసాగిన గ్రీన్‌హంట్ ఆపరేషన్ తదుపరి 'సమాధాన్' వ్యూహంతో అతి దూకుడుగా హంతక దాడులకు పాల్పడుతోంది. వందలాది మంది ప్రజలను, పదుల సంఖ్యలో విప్లవకారులను హత్య చేశారు. అయినప్పటికీ, విప్లవోద్యమం కొనసాగుతూ విస్తరిస్తూండడంతో ఏ యేటికాయేడు ప్రత్యేక మిషన్‌లను రూపొందించుకుంటూ అధునాతన ఆయుధాలతో సైనిక దాడులను ముమ్మరం చేస్తున్నారు. హెలికాప్టర్లను విస్తృతంగా వినియోగిస్తూ వివిధ రూపాలలో ఆకాశదాడులు చేస్తున్నారు. ఇందుకు భారత వాయుసేన కేంద్ర-తెలంగాణా-ఛత్తీస్‌గఢ్ కమాండ్ బలగాలు కలిసి తెలంగాణా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలో తాడ్‌పాల్ లో చేసిన దాడే తాజా ఉదహరణ. మానవ రహిత విమానాలను విచ్చలవిడిగా వినియోగిస్తూ దాడులకు దిగుతున్నారు. మొత్తం అడవి ప్రాంతంలో కూడా మొబైల్ నెట్‌వర్క్‌ను పటిష్టం చేస్తున్నారు. వీటన్నింటికన్నా గ్రామాలలో నిరుద్యోగ లంపెన్ యువతను, ఉద్యమంచే శిక్షించబడిన కుటుంబాల వారిని, పోలీసు కుటుంబాలను, దుష్ట తెగ పెత్తందార్లను చేరదీసి డబ్బు కక్కుర్తితో, ఉద్యోగాల ఆశతో వారికి పూర్తి భద్రతా హామీలతో ఇన్ఫార్మర్లుగా మార్చుకుంటున్నారు. ప్రధానంగా వారిచ్చే సమాచారం పై ఆధారపడి దాడులు చేస్తూ పోలీసులు భారీ హత్యాకాండలకు పూనుకుంటున్నారు.

2017 మే లో కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో మావోయిస్టు ప్రాంతాల పోలీసు, సైనిక, పౌర, న్యాయ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులను సమావేశపరిచి విప్లవోద్యమ నిర్మూలనకై 'సమాధాన్' వ్యూహాన్ని రూపొందించారు. 2022 లోపు మావోయిస్టు రహిత దేశంగా మారుస్తామని గడువు నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బి.జె.పి. ప్రభుత్వం 2019 లోపే అంతమొందిస్తామని వేగిరపడుతోంది. మహారాష్ట్ర బి.జె.పి. ప్రభుత్వం కూడా ఆ వరుసలోనే పోటీ పడుతోంది. అందుకు కేంద్రం ఆయా రాష్ట్రాలకు కావలసిన నిధులు గుమ్మరించడమే గాకుండా, అడిగినన్ని అర్ధసైనిక బలగాలను అందజేస్తున్నది. రాష్ట్రాలు సైతం నిరుద్యోగ యువతకు మరే ఉద్యోగాలు ఇవ్వలేకపోతూ సాయుధ బలగాలలో నింపుతూ వారికి ప్రధానంగా కమాండో శిక్షణ గరుపుతూ ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంటూ పోతున్నాయి. ఫలితంగా, మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలు పోలీసు ఉక్కుపాదాల కింద నలిగిపోతూ ప్రజల

జీవితాలు అస్తవ్యస్తమవటమే గాకుండా వారు కాకీల యాతనలు భరించలేక పోతున్నారు. రోజూ గ్రామాలపై కమాండోల దాడులే, గస్తీల పేరుతో ప్రత్యేక బలగాలు అడవులు దద్దరిల్లేలా కాల్పులు జరపడం, ఆ కాల్పులలో పొట్టగడుపుకోవడానికి అడవిలో సంచరించే ఆదివాసులను హత్యచేయడం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం. వారి చిరుఆస్తులను ధ్వంసం చేయడం అతి సాధారణ దృశ్యమై పోయింది. ఈ మధ్య గఢ్‌చిరోలి జిల్లాలో ఫిబ్రవరి 5 నాడు గనుల తవ్వక ప్రాంతం కోయన్‌వర్శే గ్రామ అడవిలో గులేర్‌తో అగుపడిన ఉరావ్ యువకుడు రాంకుమార్‌ను సి60 కమాండోలు వాస్తవాలతో ఏ సంబంధం లేకుండానే నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. అదే జిల్లాలో చినవెడంపల్లి గ్రామ అడవిలో పక్షుల వేటకు వెళ్లిన సోన్‌సాయి (35) అనే ఆదివాసీ రైతు సి60 కమాండోల వలలో చిక్కి సజీవంగా దహనమయ్యాడు. ఇలాంటి ఘటనలు ఆదివాసుల జీవితాల్లో గత దశాబ్ద కాలంగా సాధారణమౌతూ వస్తున్నాయి. ఈ హంతక దాడులను ఖండించి, వాటిని ప్రతిఘటిస్తూ విప్లవోద్యమానికి పూర్తి అండగా నిలచి, దానిని కాపాడుకోవలసిందిగా ప్రజలను మా పార్టీ కోరుతుంది.

ఉద్యమ ప్రాంతాల ప్రజలపై పెరుగుతున్న దాడులకు, హత్యాకాండకు, జైలు పాలైనవారికి విధిస్తున్న కఠిన, దీర్ఘకాల శిక్షలకూ ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభానికీ విడదీయరాని సంబంధం వుంది. దేశంలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ కొనసాగుతున్న సంక్షోభం నుండి దోపిడీ పాలకవర్గాలు గట్టెక్కడానికి మన దేశ ప్రాకృతిక వనరులను భారీగా కొల్లగొట్టుకపోవడానికి ఆగమేఘాల మీదా వేగిరపడుతున్నాయి. కేంద్ర, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు పోటీ పడుతూ నేతలు దేశ వనరుల అమ్మకానికి దేశ, విదేశాలు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఆయా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద ప్రభుత్వాలతో, బహుళ జాతి కార్పోరేషన్‌లతో పదుల కొద్దీ పరస్పర అవగాహన పత్రాలు కుదుర్చుకుంటున్నారు. వారికి హామీల మీదా హామీలిస్తూ సత్వర ఫలితాలకై మౌలిక సదుపాయాల రూపకల్పనలో మునిగిపోయారు. వాటి పరిపూర్తికై ఖాకీలను వినియోగిస్తూ ప్రజలపై తీవ్ర దాడులకు పాల్పడుతున్నారు. గఢ్‌చిరోలి జిల్లాలో ఒక్క సూర్జాగఢ్ గనుల తవ్వకాల కోసమే దాని పరిసర గ్రామాలలో, అడవిలో దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి అయ్యాక 6 ప్రత్యేక అర్ధసైనిక శిబిరాలను వలయంలా ఏర్పరిచారు. వారానికో విడత 400 వాహనాలలో పూర్తి పోలీసుల రక్షణలో ముడి పదార్థం లాయిడ్ కోసం తరలిస్తున్నారు. బస్తర్ డివిజన్‌లోని గనుల తవ్వకాల ప్రాంతాలన్నీ గత 15 ఏండ్ల రమణ్‌సింగ్ పాలనలో టాటా, జిందల్, ఎస్సార్ సహా డజన్ల కొద్దీ ఘరానా కార్పొరేట్ శక్తులకు అమ్మకమయ్యాయి. ప్రజలకు అవి జీవన్మరణ సమస్యగా మారడంతో వారు అసమాన త్యాగాలకు సిద్ధపడి ప్రతిఘటిస్తున్నారు. వారి జీవనం కోసం ప్రభుత్వాల విధానాలను, పోలీసుల తుపాకులను అడ్డుకోవడం వారికి అనివార్యమౌతోంది.

ఆదివాసీ ప్రాంతాలలో పెసా, గ్రామ సభలను అడ్రస్ లేకుండా చేస్తున్నారు. మరోవైపు తేనెలొలికే మాటలతో అభివృద్ధి..... అభివృద్ధి అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఇందులో మోదీ మరియు రమణ్‌సింగ్, దేవేంద్ర ఫడ్నవీస్, రఘువరదాస్, చంద్రబాబు నాయుడు, పునరన్ విజయన్, నవీన్ పట్నాయక్, చంద్రశేఖరరావులు ముందున్నారు. దేశంలో చుక్కలంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు, విపరీతంగా పెరిగిపోతున్న నిరుద్యోగం, రైతాంగ ఆత్మహత్యలు, ఆకలి చావులు, అత్యాచారాలు, అవినీతి కుంభకోణాలు ఎన్ని సమస్యలు ఎంత పెరిగిపోతున్నా పాలకులకు మాత్రం దోపిడీ వర్గాల, సంపన్న కుటుంబాల అభివృద్ధి ధ్యాసే తప్ప ప్రజల బాగోగుల పట్టింపే లేదు. దోపిడీ పాలక వర్గాలు తాము రాసుకున్న అన్ని చట్టాలను తుంగలో తొక్కుతూ పౌర, ప్రజాస్వామ్య హక్కులను హననం చేస్తున్నాయి. ఆ పోరాట ప్రజలకు ప్రజాస్వామిక వాదులు, మేధావులు, హక్కుల కార్యకర్తలు, ఆదివాసీ హితైషీలు అండగా ఉంటే వారిని తెల్లచొక్కాల/పట్టణ మావోయిస్టులంటూ ఎంతగానో వేధిస్తున్నారు. అరెస్టులు చేస్తున్నారు. బూటకపు కేసులు నమోదు చేస్తూ దీర్ఘకాలిక శిక్షలు విధిస్తూ కటకటాల పాలు చేస్తున్నారు. కామ్రేడ్స్ సాయిబాబా, ప్రశాంత్‌రాహీ, హేమ్‌మిశ్రా, పాండు నరోటీ, మహేష్ తిర్కీ, విజయ్‌తిర్కీలకు పడిన శిక్షలు అందుకొక ఉదాహరణ. ఇటీవలే భీమా కోరేగాం కుట్రలకు సూత్రధారులంటూ కొంతమంది మహారాష్ట్రలోని సర్కారీ మేధావులు నాగపూర్‌లోని పేరున్న వకీలు సురేంద్ర గడ్‌లింగ్, కబీర్ కళామంచ్ కళాకారిణి హర్షాలీ, దళిత నాయకుడు సుధీర్ దావుడేలను పేర్కొనగా పోలీసులు వారి ఇళ్లపై దాడులు చేసి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను ఎత్తుకుపోయారు. ఇక వాటి నెపంపై వారిని ఎప్పుడైనా కటకటాల పాలు చేయడానికి పోలీసులు పాచికలు కదుపుతున్నారు. ఈ చర్యలను మా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది.

పై జీవన్మరణ సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే మరోవైపు దేశంలో హిందుత్వ శక్తుల దాడులు పెరిగిపోతున్నాయి. గత నాలుగేళ్లలో వందల సంఖ్యలో హిందుత్వ దాడులు జరిగి అనేక మంది ముస్లిం, దళిత, ఆదివాసీ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆస్తులు నష్టపోయారు. సమాజంలోని అన్ని సెక్షన్‌ల ప్రజలు హిందుత్వ వేదింపులకు గురవుతున్నారు. అయినప్పటికీ, పాలకులకు కావలసింది మాత్రం వారి ఓట్లు తప్ప వారి రక్షణతో పాటు వారి మౌలిక సమస్యల పరిష్కారం ఎంత మాత్రం కాదు.

**ప్రజలారా !**

నక్సల్బరీ రగిలించిన నిప్పురవ్వ దావానలమై దేశమంతా రాజుకుంది. ఆ మంటలు ప్రజ్వరిల్లుతుంటే దోపిడీ పాలకవర్గాలు భరించలేక పోతున్నాయి. ముఖ్యంగా దేశంలోని మావోయిస్టు ఉద్యమం అధికారంలో ఉన్న కాషాయ ఉగ్రవాదులకు కంటగింపుగా మారింది. గత ప్రభుత్వాలకన్నా అది అతి దూకుడుగా తన వ్యూహాలను అమలు చేస్తున్నది. అయినప్పటికీ, దేశంలో పెరుగుతున్న ప్రజా చైతన్యం, ప్రజా పోరాటాలు, ప్రజాస్వామిక ఉద్యమాలతో పాటు విప్లవోద్యమం వారి దోపిడీ ఆటలు వారనుకుంటున్నట్టుగా సాగనివ్వడం లేదు. ప్రజలు గతం కన్నా చాలా సమరశీలంగా పోరాడుతున్నారు. ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ప్రజలకు అండగా నిల్చి దృఢంగా, అంకితభావంతో పోరాడుతోంది. దోపిడీ పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలన్నింటినీ మా పార్టీ ఎప్పటికప్పుడు ప్రజలలో ఎండగడుతూ ప్రజలను సంఘటితపరుస్తూ పోరాటాలలోకి సమీకరిస్తోంది. ముఖ్యంగా విప్లవోద్యమ ప్రాంతాలలో ప్రజల ప్రత్యామ్నాయ ప్రభుత్వాలను నిర్మిస్తూ దేశంలో నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణానికై త్యాగ నిరతితో, సాహసోపేతంగా పోరాడుతోంది. ఫలితంగా సల్వాజుడుం, సేంద్ర, హర్మద్ వాహినీలు మట్టిగరిచాయి. తదుపరి 2009 నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యూహంతో యు.పి.ఏ. ప్రభుత్వం ప్రజలపై యుద్ధాన్ని ప్రకటించింది. కానీ అది కూడా 2017 ఏప్రిల్ 24 బుర్కపాల్ దాడితో ఓటమి పాలై తోకముడిచింది. తక్షణం కేంద్ర హోం మంత్రి రాజనాథ్ సింగ్ ఓటమిని నర్మగర్భంగా అంగీకరిస్తూ పరుష పదజాలంతో మా వ్యూహం మార్చుకుంటామని ప్రకటించి 'సమాధాన్' వ్యూహాన్ని ముందుకు తెచ్చాడు. గడిచిన 50 ఏళ్ల భారత ప్రజాతంత్ర విప్లవోద్యమంలో ప్రజలు అలుపెరుగక పోరాడుతూ శత్రు వ్యూహాలను వమ్ముచేస్తూ ప్రజాయుద్ధ అనుభవాలను ప్రోది చేసుకుంటున్నారు. వాటితో ఇపుడు నూతన 'సమాధాన్' వ్యూహాన్ని ఎదుర్కోవలసిందిగా మా పార్టీ ప్రజలకు పిలుపు నిస్తున్నది. ఉన్నత స్థాయిలో జరుపుతున్న శత్రుదాడులను ఉన్నతమైన చైతన్యంతో ఓడించకుండా గత 5 దశాబ్దాల ప్రజాయుద్ధ విజయాలను కాపాడుకోలేం. అందుకే మరింత చాకచక్యంతో, దృఢంగా, తప్పులకు అవకాశం

ఇవ్వకుండా శత్రువును లోతుగా అధ్యయనం చేస్తూ ఎత్తుగడల ఎదురుదాడులతో క్రియాశీలక ఆత్మరక్షణాయుద్ధాన్ని సాహసంగా ముందుకు తీసుకెళ్లాల్సిన తరుణం ఇది. అందుకు అమరుల అనుభవాల నుండి నేర్చుకుంటూ వారి ఆశయాలతో, ఆదర్శాలతో పోరాడండి.

ప్రజాస్వామిక వాదులారా, పాత్రికేయులారా, హక్కుల కార్యకర్తలారా, విద్యార్థి యువజనులారా

2016 అక్టోబర్‌లో ఒడిశాలోని రామగూడలో దాదాపు 31 మంది కామ్రేడ్స్‌ను ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ పోలీసులు హత్య చేసినపుడు మీరంతా యుద్ధ ప్రాతిపాదికపై కదలి వాస్తవాలను ప్రపంచం ముందుంచారు. ఈనాడు అంతకు మించిన హత్యలు జరుగుతున్నాయి. వీటిపై మీరు తక్షణం నిజ నిర్ధారణకు పూనుకుంటారనీ, దోషులను శిక్షించే న్యాయ పోరాటంలో ముందుండాలనీ మా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) విజ్ఞప్తి చేస్తోంది. మీ పైన కూడా ఫాసిస్టు దాడులు జరుగుతున్నాయి, మిమ్మల్ని అరెస్టులు చేస్తున్నారు, బెయిల్‌లు ఇవ్వకుండా దీర్ఘకాలం కటకటాల వెనక వుంచుతున్నారు. మీ పై కూడా దాడులు చేస్తూ మిమ్మల్ని హత్య చేస్తూన్నారు. అయినప్పటికీ మీరు ధైర్యంగా ప్రజల వెంటా, ప్రజా ఉద్యమాల వెంటా దృఢంగా నిలబడుతారనీ మా పార్టీ పూర్తిగా మీపై విశ్వాసంతో వుంది. ప్రజలలో భయబీభత్సాలను సృష్టించ తలపెట్టిన సల్వాజుడుం, సేంద్ర, హర్మద్ వాహినీలను బట్టబయలు చేసి ఓడించడంలో మీ పాత్ర శ్లాఘనీయమైనది. ఆ తదుపరి ముందుకు వచ్చిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఎండగట్టడంలో, దానిని తోకముడిచేలా చేయడంలో మీరెంతో ధైర్యంగా నిలిచి పోరాడారు. భారత విప్లవోద్యమంలో పెంపొందుతున్న మీ బాధ్యతల నేపథ్యంలో చేస్తున్న మీ కృషిని మా పార్టీ అభినందిస్తున్నది. ఇక ఇప్పుడు మీరు సమాధాన్‌తో తలపడడానికి మరింత గట్టిగా పూనుకుంటారనీ, హిందుత్వ శక్తుల ఆగడాలకు అడ్డుకట్టలు వేయడానికి చైతన్యవంతంగా సిద్ధమౌతారనీ మా పార్టీ ఆశిస్తున్నది.

- ✶ విప్లవ, జాతి విముక్త, ప్రజాస్వామిక ఉద్యమాలపై కొనసాగుతున్న రాజ్యహింసను ఖండించండి, ఓడించండి.
- ✶ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను బహిర్గతం చేయండి.
- ✶ తాడ్‌పాల్, కస్నూర్, ఆయిపేంట హత్యల వెనక గల వాస్తవాలను వెలికి తీసి హంతకులను శిక్షించండి.
- ✶ తాడ్‌పాల్, కస్నూర్, ఆయిపేంట అమరుల స్మృతిలో సభలు, సమావేశాలు జరిపి వారి త్యాగాలను ఎత్తిపట్టండి. వారి ఆశయాల సాధనకై ప్రతిన పూనండి.

**విప్లవాభివందనాలతో**



**అభయ్,**

**అధికార ప్రతినిధి, కేంద్రకమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**